AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
1-12-2025 (Monday) MAIN EDITION

## విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం: సీఎం



**అక్షరటుడే, ఏపీ:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేసే పనిలో ఉన్నామని తెలిపారు. సుపరిపాలనకు నాంది పలుకుతామని ముందే హామీ ఇచ్చామన్నారు. ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిపించారని తెలిపారు. ఏలూరు జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు గోపీనాథపట్నంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పించన్ల పంపిణీలో పాల్గొన్నారు.

## అమెరికాలో కాల్పుల కలకలం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో కాల్పులు మళ్లీ కలకలం సృష్టించాయి. కాలిఫోర్నియాలోని స్టాక్టన్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. పది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

## హిల్ట్ పాలసీపై గవర్నర్‌కు ఫిర్యాదు




**హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని ఫిర్యాదు చేసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో నేతలు మహేశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులున్నారు.

## తిరుపతిలో బాంబు బెదిరింపులు



**అక్షరటుడే, తిరుపతి:** తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. కపిలతీర్థం వద్ద రెండు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ నెలలోనూ తిరుపతిలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి.

## నష్టాల్లోకి సూచీలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఉదయం 86,065.92 పాయింట్ల వద్ద రికార్డు గరిష్ఠాల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 86,159.02 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఉదయం కాసేపు లాభాల్లో ట్రేడయిన సూచీ.. క్రమంగా నష్టాల్లోకి జారుకుంది.

## తెలంగాణకు మీనాక్షి నటరాజన్




**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ నేడు తెలంగాణకు రానున్నారు. వారం రోజుల పాటు ఆమె తెలంగాణలో ఉండనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఈ క్రమంలో మీనాక్షి నటరాజన్ పర్యటిస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీలోని తాజా రాజకీయాలపై ఫోకస్ పెట్టారు. ఇటీవల ప్రకటించిన డీసీసీల నియామకంపై పార్టీలో గందరగోళం నెలకొంది. డీసీసీల విషయంలో పలువురు స్థానిక నేతలు, సీనియర్ నేతల అసంతృప్తి వ్యక్తం చేస్తుండడంతో ఆమె నేతలతో భేటీ కానున్నారు.

## ఐఏఎస్ అధికారి కూతురు ఆత్మహత్య

**అక్షరటుడే, ఏపీ :** ఏపీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి చిన్నరాముడి కుమార్తె ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మాధురి కొన్ని నెలల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన రాజేష్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లయిన నాలుగు నెలలకే ఆమె పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి వేధింపులు తాళలేక వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె ఉరి వేసుకుంది. తన కూతురు మాధురిని రాజేష్ ట్రాప్ చేశాడని ఐఏఎస్ అధికారి ఆరోపించారు. బలవంతంగా పెళ్లిచేసుకున్నాడని పేర్కొన్నారు. అంతకుముందు మరో అమ్మాయిని సైతం ఇలానే మోసం చేశాడని ఆరోపించారు.

**స్థానిక సంస్థ ఎన్నికల్లో వేలం వెర్రి కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో బేరసారాలు, ప్రలోభాల పర్వం జోరందుకుంది. పల్లెల్లో లక్షల్లో డబ్బు చేతులు మారుతోంది. సర్పంచ్, వార్డు స్థానాలను ఏకగ్రీవం చేసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పలు గ్రామాల్లో వేలం పాట నిర్వహించి పదవులను ఏకగ్రీవం చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు లక్షల రూపాయలకు పాడి పదవులు దక్కించుకుంటున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# వేలం వెర్రి

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. పదవుల కోసం భారీ పోటీ నెలకొన్న తరుణంలో గ్రామాల్లో ఏకగ్రీవం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం వీడీసీలతో పాటు ముఖ్యమైన వారి ఆధ్వర్యంలో వేలం పాటలు వేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన వారితో పాటు మిగతా ఆశావాహులను పిలిచి చర్చలు జరుపుతున్నారు. ప్రధానంగా వీడీసీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో ఏకగ్రీవ ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

- **గ్రామాల్లో జోరుగా పదవుల పందేరం**
- **సర్పంచ్, వార్డు స్థానాలకు పోటాపోటీ**
- **ఏకగ్రీవం చేసేందుకు వేలం పాటలు**
- **జోరుగా బేరసారాలు.. ప్రలోభాలు**

### రూ.73 లక్షలకు సర్పంచ్ పదవి

నల్గొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ పంచాయతీలో 11 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. నామినేషన్ అనంతరం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. కనకదుర్గ ఆలయ నిర్మాణం, గ్రామాభివృద్ధి కోసం ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వేలంపాట నిర్వహించారు. ఇందులో మహమ్మద్ సమీనా ఖాసీం అనే అభ్యర్థి రూ.73 లక్షలకు పాడి సర్పంచ్ పదవి దక్కించుకోవడం గమనార్హం. నల్గొండ జిల్లా ములకలపల్లిలో బొడ్డుపల్లి లింగస్వామి అనే అభ్యర్థి రూ.19 లక్షలకు వేలంలో సర్పంచ్ పదవి దక్కించుకున్నాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో రెండు గ్రామాల్లో ఏకగ్రీవం చేసేందుకు వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. ఒకచోట రూ.8 లక్షలకు పైగా, మరోచోట 6 లక్షల దాకా వేలం పాడి సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్నట్లు సమాచారం. ఆర్మూర్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో సర్పంచ్ స్థానంపై కన్నేసిన ఆశావహులు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వేలం పాడేందుకు సిద్ధమవుతున్నారు.

### చర్చలు, సంప్రదింపులు

పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో కోలాహలం కనిపిస్తోంది. ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది. ఎవరు పోటీలో ఉంటారు.. గెలుపు అవకాశాలు ఎవరికి ఉన్నాయనే వాటిపైనే చర్చలు జరుగుతున్నాయి. అభ్యర్థుల బలాబలాలకు తోడు ఎవరు ఎంత ఖర్చు పెడతారనే దానిపై ఆసక్తికర చర్చ సాగుతోంది. మరోవైపు, ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ఉన్న అభ్యర్థులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సంఘాల వారీగా మచ్చిక చేసుకునేందుకు చర్చలు సంప్రదింపులు జరుపుతున్నారు. సంఘ సభ్యులు గంపగుత్తగా ఓట్లు వేస్తే ఇంత మొత్తం ఇస్తానని, ఫలానా అభివృద్ధి పనులు చేస్తామని హామీలు ఇస్తున్నారు. దీనికి తోడు విందు రాజకీయాలకు తెర లేపారు.

### పట్టించుకోని అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో సర్పంచ్ పదవులకు వేలంపాట నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వేలంలో పదవులు కొనడం గమనార్హం. అభివృద్ధి, ఆలయాల పేరిట వేలం పాట నిర్వహిస్తున్నా.. అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించడం లేదు. వేలంపాట ద్వారా ఏకగ్రీవం చేసిన ప్రాంతాల్లో ఎన్నికలు రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు.

## మేడారం పనుల నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని సీఎం సూచించారు. పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఉండకూడదన్నారు. గద్దెల వద్ద వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గద్దెల వద్ద నాలుగువైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గుడి చుట్టూ పచ్చదనం కన్పించేలా అభివృద్ధి చేయాలన్నారు. సమావేశానికి మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు హాజరయ్యారు.

## మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సుల కేటాయింపు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.

## కశ్మీర్‌లో ఎన్ఐఏ సోదాలు





**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల కారు బాంబు పేలుడు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో పలువురు మృతి చెందారు. దీనిపై దర్యాప్తు జరుపుతున్న ఎన్ఐఏ ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసింది. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కశ్మీర్లోని 8 ప్రాంతాల్లో సోమవారం ఉదయం ఎన్ఐఏ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. జమ్మూ కశ్మీర్ పోలీసులతో కలిసి జాతీయ దర్యాప్తు సంస్థ పుల్వామా, షోపియన్, కుల్గాం జిల్లాల్లోని ఎనిమిది ప్రదేశాల్లో దాడులు నిర్వహించింది. కీలక నిందితుడు జాసిర్ బిలాల్ వనీ ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టింది. డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వనీ నవంబర్ 10న జరిగిన ఎర్రకోట కారు పేలుడులో కీలక కుట్రదారులలో ఒకరిగా గుర్తించారు.

## పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం



**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీవేడిగా మొదలయ్యాయి. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ప్రధాని అభినందనలు తెలిపారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడేలా సభ్యులు వ్యవహరించాలని సూచించారు. సభ ప్రారంభమైన అనంతరం విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో లోక్‌సభ స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాక.. విపక్ష ఎంపీలు వివిధ అంశాలపై ఆందోళన కొనసాగించడంతో సభను పలు మార్లు వాయిదా వేశారు.

## కేరళ ముఖ్యమంత్రికి ఈడీ నోటీసులు



**అక్షరటుడే, కేరళ:** మసాలా బాండ్ కేసులో కేరళ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. సీఎంతో పాటు మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్, సీఎం ప్రధాన ప్రధాన కార్యదర్శి కేఎం అబ్రహంలకు రూ.466 కోట్ల ఫెమా షోకాజ్ నోటీసు జారీ చేసిందని అధికారులు తెలిపారు. వ్యక్తిగత హాజరు అవసరం లేని ఈ నోటీసును విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ప్రకారం ఈడీ ఇచ్చింది. ఈ దర్యాప్తు కేఐఐఎఫ్‌బీ మసాలా బాండ్ల ద్వారా సేకరించిన రూ.2వేల కోట్ల తుది వినియోగానికి మరియు నిబంధనలకు అనుగుణంగా ఉండడానికి సంబంధించింది. మసాలా బాండ్ ద్వారా సేకరించిన నిధులను మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఉపయోగించారని, ఇది ఫెమా నిబంధనల ఉల్లంఘన అని ఈడీ పరిశోధనలు చెబుతున్నాయి.

## రెండో పెళ్లి చేసుకున్న సమంత

**నటి సమంత రెండో పెళ్లి చేసుకున్నారు. చిత్రనిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకుంది. ఈ ప్రైవేట్ వేడుక ఈ ఉదయం ఇషా యోగా సెంటర్‌లోజరిగింది. దాదాపు 30 మంది అతిథులు ఈ వేడుకకు హాజరైనట్లు సమాచారం. ఇటీవలి నెలల్లో ఈ జంట తరచుగా కలిసి కనిపించడం వల్ల వారు కేవలం సహకారులు మాత్రమే కాదని ఊహాగానాలకు వచ్చాయి. ఇటీవల ముంబైలోని ఒక కార్యక్రమంలో రాజ్‌తో కలిసి ఉన్న ఫొటోను సమంత సోషల్ మీడియా పేజీలో పోస్ట్ చేసింది. అది త్వరగా వైరల్ అయింది. చిత్రంలో, సమంత రాజ్‌ను కౌగిలించుకోవడం కనిపించింది. దీంతో వారు డేటింగ్ చేస్తున్నారని వార్తలు వచ్చాయి. దీనిపై వారు అధికారికంగా ఎప్పుడు స్పందించలేదు. అయితే తాజాగా పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. సమంత, రాజ్ వృత్తిపరంగా కూడా జతకడుతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన మా ఇంటి బంగారం అనే తెలుగు చిత్రాన్ని ఇద్దరూ కలిసి నిర్మిస్తున్నారు.** **-అక్షరటుడే, సినిమా డెస్క్**

